## ఆదర్శ వైద్యుడు డాక్టర్ ఇ.ఎన్.బి.శర్మ

ఎన్నో వేల మంది ప్రతిరోజూ పుడుతుంటారు. చనిపోతుంటారు. అయితే వారిలో ఏ ఒకరిద్దరు మాత్రమే ప్రజలు గుర్తుపెట్టుకోవాల్సినంతటి వారు వుంటారు. అలాంటి గుర్తుపెట్టుకోవాల్సిన కొన్ని వేల మందిలో ఏ ఒకరిద్దరు మాత్రమే ప్రతిక్షణం స్మరించుకోవాల్సిన వారుంటారు. అలాంటి వారిలో క్రితం సంవత్సరం కీర్తిశేషులైన డాక్టర్ ఇ.ఎన్.బి. శర్మగారొకరు. పొడుగూ, పొట్టికాని తెల్లని విగ్రహం, ఎత్తుకు తగినట్లు కండరాలు, ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడే ముఖం, సదా తెలుపురంగు ప్యాంటు, షర్టులో కన్పించే డాక్టర్ శర్మగారు వైద్యవృత్తిలోని వారంతా గర్వించదగ్గ వ్యక్తి.



శర్మగారి లాంటి వారు వంద మంది డాక్టర్లలో ఒక్కరు చొప్పున వున్నా ప్రజలు డాక్టర్లనెంతో గౌరవిస్తారంటే అతిశయోక్తికాదు. రోగి బీదవాడైనా, ధనవంతుడైనా, అడుక్కునేవాడయినా శర్మగారి దృష్టిలో ఒక్కటే. అందరినీ 'మీరు' అని పిల్చేతత్వం వారిది. డబ్బు ఇవ్వకపోతే వెయ్యిపట్టని డాక్టర్లున్న నేటి కాలంలో డబ్బిస్తానంటే పై బడి కొట్టినంత పన్జేసే శర్మగారి లాంటివారుంటారంటే చాలా మంది నమ్మలేరు. రోగు ...త్మీయతతో, ప్రేమతో ఎలా సంబోధించాలో, వారితో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోవాలంటే శర్మగారిని చూస్తే చాలు. చాలా మంది రోగులకు డాక్టర్ శర్మగారు చేయి పట్టుకుంటే చాలు. ఆయన ఏమి మందులిస్తాడన్నది వాళ్ళ కనవసరం. ఆయన మాట్లాడుతుంటేనే కొందరు రోగులకు సంతోషంతో కొంత వ్యాధి నయమవుతుంది. అందుకే రోగులు చాలా మంది ఆయన పేరెత్తగానే "దేవుడు", "మహానుభావుడు" అని చేతులెత్తి నమస్కరిస్తారు.

శర్మగారు ఆపరేషన్స్ చేసేటపుడు చూడడం వైద్యులకెవరికైనా గొప్ప అదృష్టమేనని చెప్పాలి. ఆ చేతుల వేగం చూస్తుంటే భయమేస్తుంది. ఎంతో వేగంగా, నైపుణ్యంతో శస్త్రచికిత్స చేయగల్గిన శర్మగారు తాను ప్రొఫెసర్‌ననే గర్వం ఏ మాత్రంలేని వ్యక్తి కనుకనే ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్స పూర్తయ్యాక రోగిని స్ట్రెచర్ మీద పడుకోబెట్టడం, అవసరమయితే స్ట్రెచర్ లాగడం లాంటి పనులు కూడా చేస్తుంటారు. పని విలువ ఏమిటో తెలియాలంటే అలాంటి సంఘటనలు చూడక తప్పదు.

శర్మగారు గుంటూరు జనరల్ హాస్పిటల్‌లో పని చేస్తున్నప్పుడు ఒకసారి మా క్లాస్‌మేట్ ఒకతను నాతో "శర్మగారు డాక్టర్లందరి పరువు తీసేస్తున్నాడు" అని చెప్పినప్పుడు ఆశ్చర్యంతో ఏమి చేశారేమిటని నేనతన్ని అడిగాను "ఎవరో ఒక రోగి అన్నం తినడం లేదట. తల్లిదండ్రులు ఎంత చెప్పినా నోట్లో ముద్ద పెట్టుకోవడం లేదట. ఆ విషయం వాళ్ళు శర్మగారితో చెప్పారు. ఎందుకు తినడో నేను కనుక్కుంటానని శర్మగారు ఆ రోగి మంచం వద్దకు వెళ్ళి కంచం చేతిలోకి తీసుకుని అన్నం తన చేతులతో కలిపి అతని నోట్లో పెట్టాడట." ఆ దృశ్యం చూసి మా క్లాస్ మేట్ అలా వ్యాఖ్యానం చేశాడు. అంతటి మహత్తర దృశ్యం చూసి ఆనందించవలసిన నా క్లాస్‌మేట్, వైద్య వృత్తికే పరిపూర్ణతను

**జనవరి 1వ తేదీ శ్రీ శర్మ వర్ధంతి**

చేకూర్చుతున్న శర్మగారిని చేతులెత్తినమస్కరించవలసిన నా క్లాస్‌మేట్ అంత హీనంగా మాట్లాడినా నవ్వడం మినహా మరేమీ చేయలేకపోయాను నేను. ఇలాంటి ఆత్మీయతను ప్రతిబింబించే సంఘటనలు శర్మగారి జీవితంలో ఎన్ని జరిగాయో!

శర్మగారు ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆస్పత్రికి వచ్చినప్పుడు ఎలా నవ్వుతూ వుంటారో మధ్యాహ్నం 3 గంటల వరకు అలానే నవ్వుతూ వుంటారు. ఇది ఏ కొందరు కర్మయోగులకో తప్ప అందరికీ సాధ్యమయే పనికాదు. ఓపిక, సహనం డాక్టర్లకు ఎంత వుండాలో శర్మగారిని చూసినవాళ్ళకు మరొకరు చెప్పవలసిన పని లేదు. శర్మగారు ఎదురైతే ఎవరికీ చేతులెత్తి నమస్కరించని మొండి విద్యార్థులు కూడా అసంకల్పితంగానే విష్ చేస్తుంటారు. అంతటి గొప్ప వ్యక్తిత్వం ఆయనది. శర్మగారు క్లాసు తీసుకుంటే తన వార్డులోని విద్యార్థులేకాక మిగతా వార్డులలోని విద్యార్థులు కూడా వస్తారు. అక్కడ తిరునాళ్ళ జరుగు తున్నట్లుగా వుంటుంది. రోగుల బాధను తమ బాధగా ఫీల్ అయి వైద్యం చేసే ఆదర్శ వైద్యులు డాక్టర్ శర్మగారు.

మంచితనం, మానవత్వం, నైపుణ్యంనిండుగా వుండి ప్రజలచేత దేవుడు డాక్టరుగా పిలిపించుకున్న శర్మగారు దేవుడిలో కలిసి సంవత్సరమయింది. ఈ సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకొని ఆయన లాగే రోగులపై ప్రేమానురాగాలను చూపించటమే మనం ఆయనకివ్వగల సరైన శ్రద్ధాంజలి.

– వుప్పాల సత్యనారాయణ.M.B.B.S.
గుంటూరు వైద్య కళాశాల,
గుంటూరు.



## మూఢ నమ్మకాలు

మధ్యాహ్నం పదకొండు కొట్టేసరికి ఆ వీధి వీధంతా గుప్పుమంది. జనం కోటేశ్వరరావు గారింటి వేపు పోతున్నారు. జనం అంటే మగవాళ్లు కాదు. కేవలం స్త్రీ జనం.

"రాధమ్మ ఎంత పని చేసింది" అంటూ ముక్కు మీద వేలేసుకుంటున్నారు.

ఆయనకు పెద్ద కంపెనీలో వుద్యోగం. ఒకే కూతురు. యిద్దరు కొడుకులు. కూతురు గర్భిణి. "యింత ఆలోచించకుండా రాధమ్మ యింత పని చేసింది. పాపం పెరిగిపోయింది." అంటున్నారు.

ఇంతకూ రాధమ్మగారు చేసిన ఘోరకృత్యము ఏమిటంటే కరెంటు వైరు మీద పడుతోందని కూలి వాణ్ని పిలిచి వేపచెట్టు కొట్టించింది. ఆ టైములో ఒక



బిడ్డకు 'పొంగు' అనే అమ్మవారు వచ్చింది. ఆ సమయంలో చెట్టు కొట్టించిందని ఆమె గురించి గుసగుసలాడి, చివరకు ఒక పెద్దామె చేత అడిగించి రాధమ్మను భయపెట్టాలని ప్రయత్నించారు.

రాధమ్మ భర్త కోటేశ్వరరావుగారు యిలాంటి భయాలకు లొంగే మనిషి కాదు. ఆయన యిష్టదైవాన్ని నిత్యం ఆరాధిస్తాడు.

కూతురుకు ప్రసవించే టైం వచ్చింది. నర్సింగ్ హోంకు తీసుకెళ్లారు.

'అమ్మవారు మిమ్మల్ని చల్లగా చూడాలని' పక్కింటి పేరమ్మ వేపచెట్టును గుర్తు చేస్తూనే వుంది–కోడినో, గొర్రెనో దిష్టి తీయమంది.

కూతుర్ని నర్సింగ్‌హోంలో పడుకోబెట్టి, భర్తను కారులో పోయి కాఫీ తెమ్మని ఫ్లాస్కు యిచ్చి పంపి, కూతురు ప్రసవం సుఖంగా జరగాలని వెయ్యి దేవుళ్లకు మొక్కుతూ వరండాలోనే కూలబడింది రాధమ్మ.

"మగబిడ్డమ్మా! మీ అమ్మాయి ప్రసవించింది" అని నర్సు పిలిచింది.

రాధమ్మ ఆనందానికి అంతు లేదు. ఆ మనమడే రేడియోలో పిల్లల ప్రోగ్రాంలో 'మూఢ నమ్మకాలు' నాటకంలో ప్రథమ బహుమతి కొట్టాడు.

చెరువు ఆంజనేయశాస్త్రి.